క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి



పెదగాడి వద్ద విస్తరణ పనులపై అధికారులకు సూచనలు ఇస్తున్న అదీప్‌రాజ్

సింహాచలం: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వేపగుంట నుంచి నుంచి పినగాడి వెళ్లే రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మార్గంలో పెదగాడి జంక్షన్ వద్ద జరుగుతున్న విస్తరణ పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. విస్తరణ పనుల్లో ఎలాంటి జాప్యం వద్దని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రూ.13 కోట్లతో పనులు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సత్యఫణీశ్వర్, ఏఈ ఉదయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమ, వైఎస్సార్‌సీపీ నాయకులు భగవాన్ జయరామ్, నక్క కనకరాజు, త్రినాథ్, శ్రీరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం విజయవాడకు చెందిన మంచకొండ సాయి అశ్విత నరసమ్మ అనే దాత రూ.లక్ష విరాళం అందజేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు కురకుల నాగేశ్వరరావు సంబంధిత విరాళాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో పైడపునాయుడు

పెదగంట్యాడ: ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయంతో పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని మండల విద్యా శాఖాధికారి పైడపునాయుడు సూచించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలన్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, అంతే స్థాయిలో బోధన సాగించాలన్నారు. ఈ శిక్షణకు రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్స్‌గా చింతల అగ్రహారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరహాలదొర, నరవ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ వ్యవహరించారు. సీఎంవో శిరీష, ఏపీవో అప్పలనాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో గంగవరం, ఇస్లాంపేట, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-1 చివరలో గల పార్సిల్ ఆఫీస్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ప్లాట్‌ఫారం-1 చివరలో సుమారు 25 ఏళ్ల గల ఓ వ్యక్తి మరణించాడని, తెలుపు రంగు ప్యాంట్, తెలుపు నలుపు రంగు చెక్స్ గల రౌండ్ నెక్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని బాలాజీరావు చెప్పారు. ఇతని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని, వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీని గానీ లేదా 96661 22722 / 94406 27547 నంబర్లలో తెలియజేయాలన్నారు.

పంచాయతీల అభివృద్ధితోనే గ్రామ స్వరాజ్యం

- జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు



మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ తుంపాల అప్పారావు తదితరులు



మహాత్మాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పాలక వర్గం

సబ్బవరం: ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధించవచ్చని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను ఎంపీడీవో రమేష్ నాయుడు అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తుంపాల అప్పారావు మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల గ్రామాలు సుభిక్షమవుతున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం సూచించిన 9 అంశాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలు పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతిని సత్కరించారు. అనంతరం కార్యదర్శుల డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఏవో షేక్ బాబూరావు, ఈవోఆర్‌డీ మహేష్, సర్పంచ్‌లు సాలాపు మీనా, సబ్బవరపు నారాయణమూర్తి, దెడ్డం ప్రసాదరావు, వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, కొటాన రాము, పాలిశెట్టి సురేష్ రాజ్, సాలాపు వెంకటేశ్వరరావు, బైలపూడి రామారావుతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయంలో సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అధ్యక్షతన సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ చిత్ర పటానికి సర్పంచ్ సుజాతముత్యాలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం గ్రామ పంచాయతీల ద్వారా సాధ్యమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో బదిలీ చేయడం ద్వారా గ్రామ పంచాయతీలు మరింత అభివృద్ధి సాధించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, మాజీ ఎంపీటీసీ సీహెచ్.అమ్మోరు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, చినసోమేష్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడున్నరేళ్లలో మరువలేని అభివృద్ధి

- మంత్రి అమర్‌నాథ్
- మడకపాలెంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: మూడున్నరేళ్లలో కన్నూరు పంచాయతీ పరిధిలో రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.9.57 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మరువలేని ప్రగతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాటలు వేసిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. లంకెలపాలెం సమీపంలోని కన్నూరు పంచాయతీ పరిధిలోని మడకపాలెం గ్రామంలో రూ.75.10 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చేసి ప్రజల అభ్యున్నతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంక్షిస్తున్నారన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేయడం అంటే అన్ని వర్గాలను అభివృద్ధి బాటలో నడిపించడమేనని చెప్పారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఫార్మాసిటీ బాధిత తాడి గ్రామాన్ని తరలించి, పునరావాసం కల్పించిన తరువాతే మళ్లీ ఎన్నికలకు వెళ్లనున్నామన్నారు. తాడి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టిలో పెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి, పరవాడ వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీడీవో హేమసుందరరావు, తహసీల్దార్ ప్రకాశరావు, ఎంఈవో సునీత పాల్గొన్నారు.

చురుగ్గా గడపగడపకు మన ప్రభుత్వం

మడకపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలను మూడున్నరేళ్లలో నెరవేర్చి సంక్షేమ రాజ్యంగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్ తీర్చిదిద్దారన్నారు. ఏ గడపను తట్టినా సంక్షేమం, అభివృద్ధి పలకరించాయని, దీంతో ప్రజలు వచ్చే ఎన్నికల్లో మనస్ఫూర్తిగా ముఖ్యమంత్రి జగన్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అదీప్‌రాజ్ చెప్పారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన



రేఖవానిపాలెం కొత్త చెరువు వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి కూలీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరాలని కోరుతూ రావాడ శివారు రేఖవానిపాలెం కొత్త చెరువు వద్ద ఉపాధి కూలీలు సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే చర్యలు విరమించుకోవాలన్నారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని..ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకు రూ.600 కూలి, సమ్మర్ అలవెన్స్, గునపాము, పార, తట్ట,తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు భారతి, సుధా, లక్ష్మి, పద్మ, పార్వతి పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదలకు సేవ చేయడం అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సత్యసాయి సేవా సమితి పెదగంట్యాడ, సత్యసాయి భజన మండలి వెంపళ్లనగర్ ప్రతినిధి గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో సత్యసాయి 12వ ఆరాధనోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు హాజరై సత్యసాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా పేదలకు నిత్యావసరాలను అందజేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం 70 మంది పేదలకు 22 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

‘ఉక్కు పరిరక్షణకు మరో ముందడుగు’



802వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును కాపాడుకునే క్రమంలో కార్మికులంతా మరో ముందడుగు వేయాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 802వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో పులువురు కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయని బీజేపీతో సహా ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి సహకరించని అన్ని రాజకీయ పార్టీలపై ప్రజలు స్వచ్ఛందకు తమ నిరసన తెలియజేయాలన్నారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణకు ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేనిచో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకుడు గోపాల నాయుడుకి డాక్టరేట్



గోపాలనాయుడు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న పి. గోపాలనాయుడుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ వరించింది. ఆచార్య వెలమల సిమ్మన్న భాషా సాహిత్య సేవ అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గానూ డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా గోపాలనాయుడును ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మితో పాటు కళాశాల బోధన,బోధనేతర సిబ్బంది సోమవారం సన్మానించారు.

మా భవిష్యత్తుకు జగనన్నే కావాలి

- మెజార్టీ శాతం ప్రజలు అదే కోరుకుంటున్నారు
- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ : రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు జగనన్నే విశ్వసిస్తున్నారని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న మెగా పీపుల్స్ సర్వే ప్రజల అభిప్రాయాన్ని తెలియజేసేందుకు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ కోటి కుటుంబాలను ఈ సర్వేలో భాగస్వాములను చేయగా 79 శాతం జగనన్న పాలనపై విశ్వాసం కనబరిచారన్నారు. తూర్పు నియోజకవర్గంలో సైతం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కావాలని ప్రజలు పెద్ద ఎత్తున కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 30 వేల ఓట్ల మెజారిటీతో తూర్పు నియోజకవర్గం సీటును గెలుచుకోనున్నట్లు ఎంవీవీ వెల్లడించారు. అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల సంక్షేమ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ, తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

నేడు శారదాపీఠంలో ఆదిశంకరాచార్యుల జయంతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠంలో మంగళవారం ఆదిశంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్టు పీఠం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 8.30గంటలకు విశేష పూజలు, మహా మంగళ హారతులతో శంకర జయంతి వేడుక ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

జోన్-8 అధికారుల ఫోన్ నంబర్లు

అధికారి	పేరు	ఫోన్ నంబర్
జోనల్ కమిషనర్	మల్లయ్య నాయుడు	99123 49439
సూపరింటెండెంట్	పీవీవీఎస్ఎస్ మూర్తి	98481 12030
ఏసీపీ టౌన్ ప్లానింగ్	ఎస్ సస్తి షబ్నన్	98489 33236
టీపీఎస్	పి. ప్రమీల రాణి	81878 98438
శానటరీ సూపర్‌వైజర్	కేవీ రమణ	99488 83940
రెవెన్యూ అధికారి	వి. నారాయణరావు	98485 22347
ఏపీడీ	వై. శ్రీరామ్	77299 99788
ఈఈ వర్క్స్	సంతోషి కుమారి	99123 49485
ఈఈ ఎలక్ట్రికల్	డి. శ్రీధర్	99480 78504
ఈఈ యూజీడీ	వెంకటేశ్వరరావు	79897 72161
డీఈ వర్క్స్	జి. శ్రీనివాసరాజు	77299 95949
ఏఈ ఎలక్ట్రికల్	కె. రాధిక	77299 95942
ఏఈ వాటర్ సప్లై	కె. గణేష్ రాజశేఖర్	81878 99219

చందనోత్సవంపై టీడీపీ నేతలు విమర్శలా!

- సాఫీగా ఉచిత,రూ. 300 దర్శనాలు
- అడ్డదారులు తొక్కి చెంప దెబ్బతిన్నది టీడీపీ నేత కాదా!
- 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నేత ఎర్ర వరహానరసింహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర వరహానరసింహం

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంపై అడవివరంలోని టీడీపీ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్ర వరహానరసింహం అన్నారు. 20 ఏళ్ల కిందట విశాఖ జనాభాను, ప్రస్తుత జనాభాను పరిగణలోకి తీసుకుని ఆ పార్టీ నాయకులు జ్ఞానంతో మాట్లాడాలని సూచించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లక్ష మంది భక్తులు చందనోత్సవానికి వస్తారని ఏర్పాట్లు చేస్తే అంతకు మించి భక్తులు వచ్చారన్నారు. అయినా ఉచిత , రూ.300 టికెట్ల క్యూల్లో వెళ్లిన భక్తులు సంతోషంగా దర్శనం చేసుకున్నారన్నారు.

పాతకుపోయిన వారి వల్లే వీఐపీ లైన్లలో ఇబ్బంది

కేవలం వీఐపీలు, ప్రొటోకాల్ దర్శనాలకు వచ్చిన క్యూలోనే కొంత ఇబ్బంది వచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ తక్కువ వీఐపీ టికెట్లు ప్రచురించాలని సూచిస్తే దేవస్థానంలో పూర్వ నుంచి పాతుకుపోయిన టీడీపీ సానుభూతిపరులైన అధికారులు అదనంగా టికెట్లు ప్రింట్ చేసి టీడీపీ నాయకులకు ఇచ్చారని ఆరోపించారు. ఆ టీడీపీ నాయకులే వచ్చి చందనోత్సవం బాగా జరగలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఉత్తరాంధ్రకే పరిమితమైన సింహాద్రి అప్పన్న క్షేత్రానికి నేడు మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారన్నారు.

దేవుడిని అడ్డపెట్టుకుని రాజకీయం చేస్తారా?

దేవుడ్ని అడ్డం పెట్టుకుని టీడీపీ వాళ్లు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని వరహానరసింహం మండిపడ్డారు. టీడీపీవాళ్లు అడ్డదారిలో కొందరిని స్వామి దర్శనానికి పంపించారన్నారు. దాంతో పాత ఎంక్వైరీ కార్యాలయం వద్ద ఒక మహిళా భక్తురాలు టీడీపీ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ సతివాడ శంకరరావును చెంపదెబ్బ కూడా కొట్టడం జరిగిందన్నారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో కూడా వైరల్ అయిందన్నారు. టీడీపీవాళ్లు ఉద్దేశ పూర్వకంగా రగడ సృష్టించారనడానికి ఆ ఘటనే నిదర్శనమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లంక సత్తిబాబు, ఎస్.కృష్ణ, ఎన్.అప్పారావు, సింహాద్రి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాశర్ల.. భూ సమస్య ఎప్పటిదో గుర్తించుకో....

టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పంచగ్రామాల భూసమస్యను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఎర్ర వరహానరసింహం ఆరోపించారు. 1996లో చంద్రబాబు ప్రభుత్వంలోనే దేవస్థానానికి పట్టా ఇచ్చారని, అప్పటి నుంచి భూసమస్య వచ్చిందన్నారు. ఆ తర్వాత 2015లో కూడా బ్యాలెన్స్ భూములకు కూడా పట్టా ఇచ్చారన్నారు. రైతులు, ప్రజలను ఆక్రమణదారులుగా చిత్రీకరించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూసమస్య పరిష్కరించలేదని పాశర్ల ఆరోపించడం వింతగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ విషయంపై పాశర్ల బహిరంగ చర్చకు సిద్ధం కావాలి డిమాండ్ చేశారు.

పారిశుధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



పారిశుధ్యపనులపై సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం: సింహగిరితో పాటు అడవరం, కొండ దిగువన పారిశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రజారోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. చందనోత్సవం అనంతరం సోమవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను వెంటనే డంపింగ్ యార్డ్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. పాత అడవివరం జంక్షన్ నుంచి పాత గోశాల గోశాల వరకు ఎక్కువగా వ్యర్థాలు ఉన్నాయని రెండు పూటలా పారిశుధ్య కార్మికులను ఉంచి శుభ్రం చేయించాలని సూచించారు. చెత్త తరలించే వాహనాలు అదనపు ట్రిప్పులు వేయాలని ఆదేశించారు. వ్యర్థాలు తరలించేటప్పుడు వాహనాలకు తప్పనిసరిగా నెట్ ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఈఈ సంతోషి, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా ఆరిపాక

- కలెక్టర్ చేతుల మీదుగా పత్రం అందుకున్న సర్పంచ్ పార్వతి



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీకి జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు వరించింది. జాతీయ పంచాయతీ దినోత్సవంలో భాగంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతులమీదుగా ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి అవార్డు అందుకున్నారు. స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కేటగిరీలో ఆరిపాక పంచాయతీ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సర్పంచ్ పార్వతి మాట్లాడుతూ అవార్డు రావడానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అందించిన సహకారమే కారణమన్నారు. ఎంపీడీవో రమేష్ నాయుడుతో పాటు మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ ప్రజలు,పాలకవర్గ సభ్యులతో సచివాలయ సిబ్బంది,వలంటీర్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, ఈవోఆర్‌డీ మహేష్,పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, రాజు,బండారు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



ప్రశంసాపత్రం అందజేస్తున్న పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి



సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్యకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.హేమసుందర్రావు మాట్లాడుతూ 2021-22 సంవత్సరంలో పలు పంచాయతీలు సమగ్ర అభివృద్ధి లక్ష్యాలు సాధించాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కన్నూరు, పి.బోనంగి, చీపురుపల్లి వెస్ట్, రావాడ, వెన్నలపాలెం, గొర్లివానిపాలెం, ఈదులపాక బోనంగి, తానాం గ్రామ పంచాయతీలకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి పద్మజ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెందుర్తిలో..

సింహాచలం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పెందుర్తి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని 15 పంచాయతీల సర్పంచ్‌లు, సెక్రటరీలను ఎంపీపీ మధుపాడ నాగమణి సత్కరించారు. అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రావు పాల్గొన్నారు.